సాక్షి
విశాఖపట్నం

ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యం

సీఎం జగన్ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని మంత్రి విడదల రజని అన్నారు. 8లో



సినీ నటి రెజీనా సందడి

గీతం వర్సిటీలో శనివారం జరిగిన షోర్ ఫెస్ట్–23 కార్యక్రమంలో హీరోయిన్ రెజీనా సందడి చేసింది. 8లో



ఏసీబీకి చిక్కిన వీఆర్వో

లంచం తీసుకుంటూ పరవాడ మండలం రావాడ వీఆర్వో జీవీ చలపతిరావు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. 12లో

న్యూస్‌రీల్

ఎస్‌ఈపై చర్యలు

'రాషా లీలలు' కథనంపై కమిషనర్ స్పందన

సాక్షి ఎఫెక్ట్..

అల్లిపురం: చెత్త తరలింపులో రాషా ఇన్ఫ్రా సంస్థ నిర్లక్ష్యంపై 'సాక్షి' శనివారం ప్రచురించిన 'రాషా లీలలు' కథనానికి జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు స్పందించారు. యార్డులో పేరుకుపోయిన వ్యర్థాలు తరలించడంలో సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. సంబంధిత అధికారులు స్పందించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త తరలించే వాహనాలు మరమ్మతులకు గురై ఏడాది కాలంగా పనిచేయడం లేదని గుర్తించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత సూపరింటెండెంట్ ఇంజినీర్‌పై చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి రికార్డులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ గత నెలలో పలు ఉత్పత్తి రికార్డులు నమోదు చేసింది. జనవరిలో బ్లాస్ట్‌ఫర్నేస్–1 ప్లాంట్ ప్రారంభం నుంచి ఏ నెలలో సాధించని విధంగా 2,33,985 టన్నుల హాట్ మెటల్‌ను ఉత్పత్తి చేసింది. స్ట్రక్చరల్ మిల్ 64,885 టన్నుల ఉత్పత్తులు, విస్తరణ యూనిట్లు వైర్ రాడ్ మిల్–2, స్పెషల్ బార్ మిల్, స్ట్రక్చర్ మిల్‌లు 1,75,094 టన్నులు ఫినిష్డ్ స్టీల్ ఉత్పత్తి చేసి అత్యుత్తమ పనితీరు కనబరిచింది. గత సంవత్సరం ఇదే కాలంలో సాధించిన ఉత్పాదనతో పోలిస్తే వరసగా 25 శాతం, 81 శాతం, 29 శాతం వృద్ధిని నమోదు చేసింది.

రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ ఎంపిక పోటీలు నేడు

తగరపువలస: షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు చిట్టివలస బంతాట మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్‌బాల్ కార్యదర్శి సిహెచ్ రవికుమార్ తెలిపారు. ఈ నెల 10 నుంచి మూడు రోజుల పాటు కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్, బాపులపాడులో 41వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళలు, పురుషుల అంతర రాష్ట్ర షూటింగ్ బాల్ పోటీలు జరగనున్నాయి. అందుకు జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 83744 94128, 95508 14812 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కేజీహెచ్‌లో అధునాతన వైద్యం

- ఆస్పత్రిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నాం
- రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం

మహారాణిపేట: కేజీహెచ్‌కు వచ్చే రోగులకు అధునాతన వైద్య సదుపాయాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని అన్నారు. రూ.1.25 కోట్లతో కేజీహెచ్‌లో ఓపీ కౌంటర్, వెయిటింగ్ హాల్, బ్యూటిఫికేషన్, ఓపీ టికెట్ కౌంటర్‌లో అదనపు వసతులు, భావనగర్ వార్డు నుంచి రేడియాలజీ విభాగం వరకు కనెక్టింగ్ కారిడార్, రాజేంద్రప్రసాద్ బ్లాక్‌లో జనరల్ వార్డు–ఏ వార్డును ఏఎంసీయూ వార్డుగా మార్పు, అంకాలజీ విభాగం, క్యాజువాలిటీ అభివృద్ధి తదితర పనులు చేపట్టారు. వీటిని మంత్రి విడదల రజని శనివారం ప్రారంభించారు. సీఎస్సార్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కేజీహెచ్‌ను పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అంకాలజీ విభాగాన్ని రూ. 50కోట్లతో అధునాతనంగా అభివృద్ధి చేస్తామన్నారు. క్యాన్సర్ చికిత్స ఎంతో ఖర్చుతో కూడుకుందని.. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోందని వివరించారు. క్యాన్సర్ రోగుల చికిత్స కోసం హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రితో ప్రభుత్వం ఎంవోయూ చేసుకుందన్నారు. అనంతరం అంకాలజీ విభాగంలో రోగుల కోసం కేర్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. తర్వాత ఓపీ గేటు దగ్గర ఆధునికీకరించిన పార్కు, ఓపీ కౌంటర్, విశ్రాంతి గదులు, దంత వైద్య విభాగాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ కేజీహెచ్ వైద్యులు రోగులకు మంచి సేవలు అందిస్తున్నారన్నారు. ఇటీవల తాను సాధారణ మహిళగా కేజీహెచ్‌ను తనిఖీ చేశానని.. రోగులను పరామర్శించి ఇక్కడ అందుతున్న సేవలపై వారి అభిప్రాయాలు సేకరించినట్లు చెప్పారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నాడు–నేడు కింద ఆస్పత్రులు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. గతంలో కేజీహెచ్‌లో దారుణ పరిస్థితులు ఉండేవని.. నేడు చాలా మార్పు వచ్చిందన్నారు. కేజీహెచ్‌లో పలు వార్డులు కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా ఉన్నాయన్నారు. వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కలెక్టర్ మల్లికార్జున, కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, 30వ వార్డు కార్పొరేటర్ కె.అప్పలరత్నం, వివిధ విభాగాల అధిపతులు, డాక్టర్లు పాల్గొన్నారు.



రాజేంద్రప్రసాద్ బ్లాక్‌లో ఏఎంసీయూ వార్డును ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని



ఓపీ విభాగం వద్ద రోగులతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని, ఎమ్మెల్యే వాసుపల్లి

లోకేష్ చేస్తోంది వృథాయాత్ర

- ఈ విషయాన్ని ఇప్పటికైనా గ్రహిస్తే మంచిది
- వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని

మహారాణిపేట: తెలుగుదేశం నేత నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు జన స్పందన లేదని.. అయినప్పటికీ అతను పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో ఆ పార్టీ నాయకులకే అర్థం కావడం లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి మంత్రి విడదల రజని అన్నారు. కేజీహెచ్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర రాజకీయ చరిత్రలోనే ఒక విఫల ప్రయత్నంగా మిగిలిపోతుందన్నారు. ఈ యాత్ర వల్ల ప్రజలకు వచ్చే లాభం ఏం లేదని, అది జనాలు గుర్తించి దూరంగా ఉంటున్నారన్నారు. లోకేష్‌కు సైతం ఈ పాదయాత్ర వల్ల ఒరిగేది ఏమిలేదని, ఈ విషయాన్ని గుర్తిస్తే ఆయనకే మంచిదన్నారు. అది వృథా పాదయాత్ర అని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నుంచి అతి త్వరలో పరిపాలన మొదలు పెడతారని మంత్రి అన్నారు. సీఎం విశాఖ వస్తే ఊహించని ప్రగతి ప్రజలు చూస్తారన్నారు. రాజకీయ భవిష్యత్‌ను అందించిన పార్టీని వదిలి పెట్టి ఆరోపణలు చేసే వారి మాటలకు విలువ ఉండదన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. ప్రభుత్వం, పార్టీపై బురదజల్లే ప్రయత్నంలో భాగమే ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు అని మంత్రి స్పష్టం చేశారు. రికార్డింగ్ ఆడియో పట్టుకుని ట్యాపింగ్ అనడంతో అర్థం లేదన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కీలక సంస్కరణలు

- 22ఏ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- విశాఖలో ప్రాంతీయ రెవెన్యూ అధికారుల సదస్సు

కొమ్మాది: రాష్ట్రంలో భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రాంతీయ రెవెన్యూ అధికారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో శనివారం ఉత్తరాంధ్ర జిల్లాల రెవెన్యూ అధికారుల సదస్సును మంత్రి ప్రారంభించి మాట్లాడారు. రెవెన్యూ సమస్యలు, ఇతర విషయాలు చర్చించేందుకు ఇప్పటికే తిరుపతి, విజయవాడలో ఈ తరహా సదస్సులు నిర్వహించామన్నారు. ఆయా జిల్లాల్లో నిర్వహిస్తున్న భూ రీసర్వేను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి.. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భూమి ప్రధాన వనరన్నారు. ఒకప్పుడు వ్యవసాయానికి అనుగుణంగానే భూమి అనే మాట ఉండేదని.. క్రమ క్రమంగా రాష్ట్రం, దేశంలో సర్వతోముఖాభివద్ధికి ఉపయోగపడే ప్రధాన వనరుగా మారిందన్నారు.

అలాంటి భూమిని యజమాన్యం చేస్తున్న రెవెన్యూ శాఖ.. ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకుని సంస్కరణలు చేపడుతోందని వివరించారు. భూమి వినియోగం పెరిగితే రాష్ట్ర జీడీపీకి దోహదపడుతుందన్నారు. రెవెన్యూ కేసులను ఆన్‌లైన్‌లో హైకోర్టు పరిష్కరిస్తోందన్నారు. 22ఏ భూములకు సంబంధించిన వివాదాలు, సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని మంత్రి ధర్మాన స్పష్టం చేశారు. విశాఖ జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో సీసీఎల్ఏ కమిషనర్ సాయి ప్రసాద్, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ బి.రామకృష్ణ, సీసీఎల్ఏ అదనపు కమిషనర్ ఇంతియాజ్‌తో పాటు విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి జిల్లా, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు, జేసీలు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, డీఆర్వోలు, తహసీల్దార్లు ఇతర సీనియర్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సదస్సు ప్రారంభోత్సవానికి ముందు జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలకు మంత్రి ధర్మాన హాజరయ్యారు. రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి వివిధ ఫొటోలకు సంబంధించిన అంశాల గురించి మంత్రికి వివరించారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ మరణించిన కుటుంబ సభ్యుల్లో 135 మందికి కారుణ్య నియామక పత్రాలను మంత్రి చేతులమీదుగా అందించారు.



కారుణ్య నియామక పత్రం అందజేస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన, కలెక్టర్ మల్లికార్జున

పవన్‌కల్యాణ్ టీడీపీ సీనియర్ కార్యకర్త

రాష్ట్ర భారీ పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సింహాచలం : పవన్‌కల్యాణ్ తెలుగుదేశం పార్టీకి సీనియర్ కార్యకర్త అని రాష్ట్ర భారీ పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో రూ.కోటి 60 లక్షల పంచాయతీరాజ్‌శాఖ నిధులతో నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణమండపాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత కాపుసామాజిక ప్రజల సమావేశంలోను, అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టవచ్చని.. పార్టీని స్థాపించిన వాళ్లు సుదీర్ఘకాలం నడపాలని భావిస్తారని, అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తారని తెలిపారు. కానీ పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ పెట్టి టీడీపీ వాళ్ల కోసం నడుపుతున్నారని విమర్శించారు. టీడీపీ జెండా మోస్తూ వెట్టి చాకిరీ చేస్తున్నారని ఆరోపించారు. అసలు 175 స్థానాల్లో పోటీ చేయలేని పవన్ కల్యాణ్ ఏవిధంగా ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. పైగా కాపు సామాజిక వర్గాన్ని మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాపులను టీడీపీకి తాకట్టు పెట్టబోతున్నారని విమర్శించారు. టీడీపీ, జనసేన కలిసి పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలు కాపు సామాజిక వర్గమంతా గమనించాలని సూచించారు. రాష్ట్రంలో కాపు సామాజిక వర్గం అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో 31 మంది కాపులకు ఎమ్మెల్యే సీట్లు ఇస్తే 27 మంది గెలిచారన్నారు. అలాగే కేబినెట్‌లో అత్యంత కీలమైన మంత్రిత్వశాఖలను ఐదుగురు కాపుసామాజిక వర్గానికి చెందినవారికే ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి పోటీచేసినా వైఎస్సార్ సీపీకి వచ్చే నష్టమేమీ లేదన్నారు. సింగిల్‌గానే పోటీకి వెళ్లడం జరుగుతుందన్నారు. అలాగే రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభావం కూడా ఏమాత్రం ఉండదని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

చిన్నికుమారి అవుట్.. చిరంజీవరావు ఇన్.!

- టీడీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని మార్చేసిన చంద్రబాబు
- డబ్బులు లేవన్న కారణంతో బీసీ మహిళ చిన్నికుమారి లక్ష్మికి షాక్
- అన్ని సామాజికవర్గాల నేతలు చేతులెత్తేయడంతో ఆదరాబాదరాగా తొలుత ప్రకటన
- డబ్బులు లేనివారికి టికెట్ ఎందుకిచ్చారంటూ నేతలపై చంద్రబాబు ఆగ్రహం
- డా.చిరంజీవరావుని అభ్యర్థిగా ప్రకటించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



చిన్నికుమారి లక్ష్మి



చిరంజీవరావు

సాక్షి, విశాఖపట్నం : నమ్ముకున్న వాళ్లను నట్టేట ముంచడం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మరోమారు నిరూపితమైంది. ఎమ్మెల్సీ టికెట్ కేటాయించడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న మహిళా నేతకు మధ్యలోనే వెన్నుపోటు పొడిచి.. వేరే వ్యక్తికి టికెట్ ఖరారు చేయడం జిల్లా టీడీపీ నాయకులను సైతం విస్మయానికి గురిచేసింది. టికెట్ కేటాయించిన మూడు నెలలకే అభ్యర్థిని మార్చేశారు. ఆదరాబాదరాగా తొలుత అభ్యర్థిని ప్రకటన చేసి.. డబ్బులు లేవన్న కారణంతో ఆమెకు మొండి చెయ్యి చూపించారు. మహిళలకు పార్టీలో గౌరవం లేదంటూ ఇటీవలే ఆ పార్టీలో ఉన్న మహిళా నేతలు బాహాటంగా చెప్పిన విషయాలు.. తాజా నిర్ణయంతో మరోసారి నిరూపితమైంది. బీసీ మహిళకు షాక్ ఇచ్చి సామాజిక వర్గ ప్రాతిపదికపై ఎంపిక చేశారు.

మార్చిలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ సందడి మొదలైంది. పార్టీ పూర్తిగా పట్టుకోల్పోతున్న నేపథ్యంలో ఎన్ని కుయుక్తులైనా పన్ని.. విజయం సాధించాలని చంద్రబాబు నానా యాతన పడుతున్నారు. ఎమ్మెల్సీ టికెట్ ఎవరికి ఇవ్వాలన్న అంశంపై సుదీర్ఘ మంతనాలు, సదస్సులు నిర్వహించిన టీడీపీ.. మూడు నెలల క్రితం మహిళా నేతకు ఖరారు చేసింది. వాస్తవానికి అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్‌తో పాటు మరికొందరు కీలక నేతల్లో ఎవరైనా ఒకరికి టికెట్‌ని కేటాయించాలని భావించారు. పార్టీ పరిస్థితి ఏమాత్రం బాగోలేదని, ఈ తరుణంలో ఎన్నికల్లో నిలబడి.. డబ్బులు పోగొట్టుకోలేమంటూ దాదాపు అన్ని సామాజిక వర్గాలకు చెందిన కీలక నేతలంతా తెగేసి చెప్పారు. దీంతో ద్వితీయ శ్రేణి నాయకులపై చంద్రబాబు, అచ్చెన్న, బుద్దా వెంకన్న దృష్టిసారించారు. గతంలో భీమిలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తూ.. ప్రస్తుతం జీవీఎంసీ 2వ వార్డు కార్పొరేటర్‌గా ఉన్న గాడు చిన్నికుమారి లక్ష్మిని సంప్రదించారు. దాదాపు రూ.4 కోట్ల వరకూ ఖర్చు చేయగలమనీ.. మిగిలిన డబ్బులు పార్టీ సర్దాలని కోరడంతో టికెట్ ఖరారు చేస్తున్నట్లు బాహాటంగా ప్రకటించారు.

బీసీ మహిళకు షాకిచ్చిన బాబు

టీడీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో గాడు కుటుంబం షాక్‌కు గురైంది. కనీసం ఒక మాట చెప్పకుండా.. టికెట్‌ని వేరేవాళ్లకు కేటాయించడాన్ని అవమానకరంగా భావిస్తున్నట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. టీడీపీలో మహిళలకు గౌరవం లేదన్నది మరోసారి సుస్పష్టమైందని పార్టీలోని కొందరు నేతలు విమర్శిస్తుండటం గమనార్హం. ఇప్పటికే రూ.కోటిన్నర వరకూ ఖర్చు చేయించి.. ఇప్పుడిలా మోసం చేశారంటూ గాడు కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీ మహిళని పార్టీ అవమానించిందంటూ జిల్లా టీడీపీ నాయకులే చెబుతున్నారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయం అచ్చెన్నాయుడికి తప్ప ఉత్తరాంధ్రలోని ఏ ఒక్క టీడీపీ నేతకు కూడా తెలియకపోవడం విశేషం. బీసీ వర్గాలకు వెన్నుపోటు పొడిచి.. ఉన్నత వర్గాలకు టికెట్ కేటాయించడం వెనుక చోడవరం టీడీపీ సీనియర్ నేత చక్రం తిప్పినట్లు తెలుస్తోంది.

డబ్బులు లేవంటూ పక్కన పెట్టేశారు

ఇప్పటికే పార్టీ ఎన్నికల ఖర్చులంటూ రూ.లక్షల వరకూ సదరు అభ్యర్థి ద్వారా ఖర్చు చేయించారు. ఇటీవల టీడీపీ ముఖ్యనేతలు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కొంత మొత్తం సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పార్టీ వైఖరిపై విసుగు చెందిన సదరు మహిళా అభ్యర్థి కుటుంబం.. టీడీపీ నేతల ఫోన్లు ఎత్తడం మానేశారు. డబ్బులు సర్దుబాటు చేయలేమని అధిష్టానానికి సమాచారం పంపించారు. దీనిపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కోట్లయినా పెట్టగలిగిన అభ్యర్థిని చూడాలని చెబితే.. ఇలాంటి వారిని ఎందుకు ఎంపిక చేశారంటూ పార్టీ ఎన్నికల పరిశీలకులపై మండిపడ్డారు. కోట్లు ఖర్చు చేసైనా ఎమ్మెల్సీ గెలవాల్సిందేననీ, అలాంటి వారికి టికెట్ కేటాయించాలని ఆదేశించారు. దీంతో మరోసారి మదింపు నిర్వహించి రావికమతం ప్రాంతానికి చెందిన డా.వేపాడ చిరంజీవరావును ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి అంటూ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించారు. డబ్బులు లేకపోవడం వల్లనే ఆమెను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది.

ప్రచారంలో దూసుకుపోతున్న సీతంరాజు

ఈసారి రాజకీయపక్షాలు ముందుగానే ఎన్నికలపై దృష్టిసారించాయి. వైఎస్సార్‌సీపీ ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలపరిచిన అభ్యర్థిగా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పేరును ప్రకటించింది. ఆయన ప్రతి నియోజకవర్గంలోనూ అన్ని వర్గాల ప్రతినిధులతో భేటీ అవుతూ ప్రచారం పర్వం కొనసాగిస్తూ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్సీ మాధవ్ కొనసాగుతున్నారు. పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) అభ్యర్థిగా డా.కోరెడ్ల రమాప్రభ కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు.



రెండు వాయిదా..
103 అంశాలు ఆమోదం



స్థాయీ సంఘ సమావేశంలో వివిధ అంశాలపై చర్చిస్తున్న సభ్యులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శనివారం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. స్థాయీ సంఘం అజెండాలో 100 అంశాలు, అనుబంధ(టేబుల్) అజెండాలో 5 అంశాలు చర్చకు వచ్చాయి. ఇందులో 103 అంశాలు ఆమోదం పొందాయి. మెకానికల్ విభాగం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పద్ధతి ద్వారా జోన్-1, 2లో ఆరు సీఎంటీ కాంపాక్టర్ సొంత వాహనాల ద్వారా చెత్త తరలించడం, జోన్-8లోని ఆరు సొంత వాహనాలు మలేరియా విభాగం నందు నిర్వహించేందుకు చర్చకు రాగా.. వాయిదా పడ్డాయి. ఈ రెండు అంశాలకు సంబంధించి పూర్తి వివరాలను తర్వాత సమావేశంలో పొందుపరచాలని సంబంధిత అధికారులను మేయర్, సభ్యులు ఆదేశించారు. పలు వార్డుల్లోని శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పన, ప్రహరీల నిర్మాణం, జీ-20 సమ్మిట్ నేపథ్యంలో ప్రధాన రహదారుల మరమ్మతులు, స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటు, తీర ప్రాంతంలో సుందరీకరణ పనులు, పెయింటింగ్, ట్రీ ప్లాంటేషన్, బీచ్‌రోడ్డులో పలు చోట్ల మరుగుదొడ్ల నిర్మాణం, ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు, తదితర అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, జీవీఎంసీ కార్యదర్శి పి.నల్లనయ్య, ఎస్‌ఈ వై.కృష్ణారావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, ఏసీపీ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

సినీ నటి రెజీనా సందడి

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆవరణలో శనివారం రెండో రోజు జరిగిన షోర్ ఫెస్ట్-23 కార్యక్రమంలో హీరోయిన్ రెజీనా సందడి చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 5వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై వివిధ సంప్రదాయ దుస్తులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం జగన్ లక్ష్యం



క్యాన్సర్‌పై అవగాహనకు నిర్వహించిన వాక్‌థాన్‌లో పాల్గొన్న మంత్రి విడదల రజని, అధికారులు, వైద్య విభాగ విద్యార్థులు, సిబ్బంది, నగర ప్రజలు

- మెడికల్ కళాశాలల్లో అంకాలజీ విభాగం అభివృద్ధి
- రూ.50కోట్లతో కేజీహెచ్‌లో అత్యాధునికంగా అంకాలజీ విభాగం
- ఏటా ఆరోగ్య శ్రీ ద్వారా క్యాన్సర్ రోగులకు రూ.400 కోట్లు ఖర్చు
- రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని వెల్లడి



మాట్లాడుతున్న ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని

బీచ్‌రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నారని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఆర్.కె.బీచ్‌లో వాక్‌థాన్ నిర్వహించారు. ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీని ముందుగా మంత్రి రజని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ వంటి పెద్ద రోగాలకు సంబంధించి ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు ప్రభుత్వం ఉచితంగా మెరుగైన వైద్యం అందిస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు ప్రజలకు ఆశాజ్యోతిలా మారాయన్నారు. 3,200లకు పైగా వ్యాధులను ఆరోగ్య శ్రీ పథకంలో చేర్చినట్లు చెప్పారు. ఇప్పటి వరకు క్యాన్సర్ రోగుల కోసం ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.400 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. క్యాన్సర్ రోగులకు వైద్యం విషయంలో ఆరోగ్యశ్రీలో ఎటువంటి పరిమితులు లేవన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఏటా 1.8 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని.. అందులో కోటి మంది మరణిస్తున్నట్లు పేర్కొన్నారు. 2040 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 30 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడతారని అంచనా వేసిందన్నారు. కలుషితం కాని ఆహారం తీసుకోవడం వల్ల మనల్ని మనం రక్షించుకోవచ్చన్నారు. క్యాన్సర్ నివారణ కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అగనంపూడిలో స్టేట్ ఆఫ్ ద ఆర్ట్ క్యాంపస్ నిర్మించారని గుర్తు చేశారు. ఆయన మార్గంలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త వైద్య కళాశాలలు నిర్మించడంతో పాటు ప్రతీ మెడికల్ కాలేజ్‌లో క్యాన్సర్ విభాగం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. మన రాష్ట్రం నుంచి ఏ ఒక్కరూ ఇతర రాష్ట్రాలకు వైద్యం కోసం వెళ్లకుండా సీఎం జగన్ ప్రణాళికలు రూపొందించారన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న 11 మెడికల్ కళాశాలల్లో రూ.119 కోట్లతో అంకాలజీ విభాగాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.50 కోట్లతో కేజీహెచ్‌లోని అంకాలజీ విభాగంలో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కర్నూలులో ప్రాంతీయ క్యాన్సర్ వైద్యశాల ఏర్పాటుకు రూ.120 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ క్యాన్సర్ పట్ల ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, డిప్యూటీ మేయర్ శ్రీధర్, మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ మురళీకృష్ణ, డాక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

మెము రైళ్ల పునరుద్ధరణ

తాటిచెట్లపాలెం: కోవిడ్ కారణంగా రద్దయిన రాజమండ్రి-విశాఖపట్నం, విశాఖపట్నం-విజయనగరం, విశాఖపట్నం-పలాస సాధారణ మెము రైళ్లను ఆయా తేదీల నుంచి పునరుద్ధరిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

- రాజమండ్రి-విశాఖపట్నం (07466/ 07467) మెము రాజమండ్రిలో ఈనెల 14వ తేదీ నుంచి, తిరుగుప్రయాణంలో విశాఖపట్నం నుంచి ఈనెల 15వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నారు. ఈ రైలు రాజమండ్రిలో ప్రతీ రోజు ఉదయం 9.20 గంటలకు బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం 2.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతీరోజు విశాఖపట్నంలో సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరి ఆదేరోజు రాత్రి 11.35గంటలకు రాజమండ్రి చేరుకుంటుంది.
- విశాఖపట్నం-విజయనగరం (07468 / 07469) మెము విశాఖలో ఈనెల 14వ తేదీ నుంచి, తిరుగుప్రయాణంలో విజయనగరం నుంచి ఈనెల 15వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నారు. ఈ మెము రైలు విశాఖలో సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 7.50 గంటలకు విజయనగరం చేరుకుంటుంది. విజయనగరంలో ప్రతీరోజు ఉదయం 6.10 గంటలకు బయల్దేరి రాత్రి 7.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది.
- విశాఖపట్నం-పలాస (07470 / 07471) మెము విశాఖ నుంచి ఈనెల 15వ తేదీ నుంచి, తిరుగు ప్రయాణంలో పలాస నుంచి కూడా ఈనెల 15వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నారు. ఈ మెము రైలు ప్రతీరోజు ఉదయం 7.50గంటలకు బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం 1 గంటకు పలాస చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పలాసలో ప్రతీ రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి ఆదేరోజు సాయంత్రం 5.50గంటలకు విశాఖ చేరుకుంటుంది.

నేడు వ్యాకులమాత మహోత్సవం


కాలినడక వెళుతున్న భక్తులు

కంచరపాలెం (విశాఖ ఉత్తర): విశాఖ అతి మేత్రాసనం, పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో కొత్తవలస కొండడాబాలకు చెందిన వ్యాకుల మాత పుణ్యక్షేత్రంలో ఆదివారం జరగనున్న పాప పశ్చాత్తాప ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో కొండ డాబాల వద్ద సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జ్ఞానాపురంలో శనివారం ఉదయం 8 గంటలకు విశాఖ ఆర్చిబిషప్ మల్లవరపు ప్రకాష్ నేతృత్వంలో రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ దివ్యపూజా బలి నిర్వహించారు. అంతకుముందు ప్రధాన దేవాలయంలో వేర్వేరుగా చర్చి ఫాదర్లు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం జరగనున్న ఈ పండగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పుణ్యక్షేత్రాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

పాప పశ్చాత్తాప పాదయాత్ర

జ్ఞానాపురం సెయింట్‌పీటర్స్ పునీత పేతురు ప్రధాన చర్చి నుంచి శనివారం ఉదయం పాప పశ్చాత్తాప పాదయాత్ర చేపట్టారు. కాలి నడకలో భాగంగా వేల సంఖ్యలో భక్తులు మేరీమాతను స్మరిస్తూ జ్ఞానాపురం నుంచి కంచరపాలెం, మర్రిపాలెం, ఎన్ఏడీ కొత్తరోడ్డు, గోపాలపట్నం, వేపగుంట, పెందుర్తి, కొత్తవలస వరకు పాదయాత్ర చేపట్టారు. భక్తి గీతాలను ఆలపిస్తూ సందడిగా పాదయాత్ర చేశారు. మార్గమధ్యలో స్వచ్ఛంద సంస్థలు భక్తులకు స్నాక్స్, ఉచిత భోజన, తాగునీరు అందజేశాయి. సాయంత్రానికి భక్తులు కొండ డాబాల వద్ద గల ఉత్సవ వేదికకు చేరుకున్నారు. విచారణ కర్తలు, గురువులు, కన్యలు, మఠవాసులు, భక్తులు, పాదయాత్రలో పాల్గొన్నారు.


వ్యాకుల మాత తేరుతో పాదయాత్రను ప్రారంభిస్తున్న విశాఖ ఆర్చిబిషప్ మల్లవరపు ప్రకాష్

భక్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలు

భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల నుంచి వేదికకు చేరే భక్తులకు ఉత్సవ ప్రాంగణంలో తాత్కాలిక వసతి సదుపాయం కల్పిస్తున్నారు. ఆదివారం జరిగే ఉత్సవానికి పరిసర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సిటీ బస్సులను ఏర్పాటుతో పాటు జ్ఞానాపురం నుంచి నేరుగా కొత్తవలస కొండ డాబాలకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు.

విదేశీ విద్యా దీవెన.. గొప్ప పథకం

- అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి

మహారాణిపేట : అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 1 నుంచి 7 స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన జరిగాయి. ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, నిర్మాణ పనులకు సంబంధించి వారి వారి మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ ప్రభుత్వం ఎంత స్పష్టంగా చెబుతున్నప్పటికీ చాలా చోట్ల అర్హులకు ఇంకా పింఛన్లు అందడం లేదన్నారు. దీనికి గల కారణాలను డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కల్యాణమస్తు పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. మార్చి 31 నాటికి జగనన్న కాలనీలు సిద్ధం చేయాలన్నారు. విదేశీ విద్యా దీవెన పథకం దేశంలో గర్వించదగినదన్నారు. గ్రామాల్లో ఎటువంటి ప్రభుత్వ కార్యక్రమాలు ప్రారంభించిన సంబంధిత ప్రజా ప్రతినిధులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. అధికారులందరూ మూడు జిల్లాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. పలు శాఖల అధికారులు సమావేశాలకు హాజరు కాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కశింకోట ఆర్ఈసీఎస్‌ను ఏపీఈపీడీసీఎల్‌లో విలీన ప్రక్రియ పరిపూర్ణంగా, త్వరితగతిని పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర కోరారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్రీరామ్మూర్తి, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు కాకినాడ మెము ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): దక్షిణ మధ్యరైల్వే పరిధిలో జరుగుతున్న కార్య నిర్వాహక పనుల నిమిత్తం ఆదివారం కాకినాడ-విశాఖపట్నం (17267/17268) మెము ఎక్స్‌ప్రెస్‌ను ఇరువైపులా రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

రేపు కోరాపుట్ ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్ : ఈనెల 6వ తేదీ విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం-కోరాపుట్(08546) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం తెలిపారు. రాయగడ-విజయనగరం లైన్‌లో జరుగుతున్న భద్రతా పరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం రైలును 2.45 గంటలు ఆలస్యంగా బయల్దేరుతుందని పేర్కొన్నారు.

ఈపీడీసీఎల్ పరిధిలో సీజీఆర్ఎఫ్ సదస్సులు

సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ వెల్లడించారు. ఈ నెల 6న జోన్-2 డివిజన్ విశాఖపట్నం పరిధిలోనూ, 7న రాజమహేంద్రవరంలోని అమలాపురం డివిజన్‌లో, 9న ఏలూరు, 15న శ్రీకాకుళంలోని పాలకొండడివిజన్, 17న విజయనగరం జిల్లా భోగాపురం సబ్‌డివిజన్ కార్యాలయాల్లో సదస్సులు జరుగుతాయన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే సదస్సుల్లో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై సీజీఆర్ఎఫ్ కమిటీకి ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. అదేవిధంగా సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి వచ్చి లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ సదస్సుల్లో చైర్ పర్సన్ బి.సత్యనారాయణతో పాటు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.హరిబాబు, పి.శ్రీనివాస్, డా. రాయసం సురేంద్రకుమార్ పాల్గొననున్నారు.

జయశ్రీ గ్రూప్స్ రాష్ట్ర కార్యాలయం ప్రారంభం


జయశ్రీ గ్రూప్స్ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

రావులపాలెం: కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో జయశ్రీ గ్రూప్స్ ముందుచూపు అభినందనీయమని విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. రావులపాలెం మండలం ఊబలంక రోడ్డులో ఏర్పాటు చేసిన జయశ్రీ గ్రూప్స్ రాష్ట్ర కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీతో విద్యుత్ వాహనాలను జయశ్రీ గ్రూప్స్ మార్కెట్లోకి తీసుకురావడం వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, రాజానగరం, పి.గన్నవరం, గోపాలపురం ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, కొండేటి చిట్టిబాబు, తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అభినందనలు జయశ్రీ గ్రూప్స్ సభ్యులకు తెలిపారు. ఈవీట్రిక్, ఐటమీ, మెగాట్రాన్ కంపెనీలతో కలసి రాష్ట్రంలో 639 షోరూములు, 3,569 చార్జింగ్ స్టేషన్లు ప్రారంభిస్తున్నామని జయశ్రీ గ్రూప్స్ నిర్వాహకులు తెలిపారు. త్వరలో రాష్ట్రంలో ప్రతి 20 కిలోమీటర్లకు ఒక చార్జింగ్ స్టేషన్ ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ ఎండీలు మనోజ్‌పాటిల్, జి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకత వెలికితీయాలి

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత


మాట్లాడుతున్న ప్రముఖ రచయిత అనిశెట్టి రజిత

పరవాడ (పెందుర్తి): బడి పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు సాహిత్యాన్ని పరిచయం చేయడమే సాహిత్యోత్సవం ఉద్దేశమని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు, రచయిత్రి అనిశెట్టి రజిత అన్నారు. మండలంలో పి.బోనంగిలో సంస్కృతి గ్లోబల్ పాఠశాల ఏడో వార్షికోత్సవంలో భాగంగా సాహిత్యోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ రచయిత, నిర్వాహక ప్రతినిధి కె.ఎన్.మల్లేశ్వరి మాట్లాడుతూ పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి రచయితలు, కవులు, కథకులు, విమర్శకులు తమవంతు కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ పి.సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రచనల ద్వారా విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, సాహిత్యాభిలాష కలగజేసేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. అలాగే సమాజం ఎకానమీ వైపు పరుగులు తీస్తూ అస్తిత్వాన్ని కోల్పోతున్న తరుణంలో చిన్న పిల్లల్లోని ప్రతిభ, సృజనాత్మకతను వెలికి తీసి సమాజానికి అందించవలసిన బాధ్యత మేధావులు, కవులు, రచయితలపై ఉందన్నారు. ప్రముఖ రచయిత వాడ్రేవు చిన వీరభద్రుడు మాట్లాడుతూ బాల్య సాహిత్యాన్ని విద్యార్థులకు పరిచయం చేయడం ఇటువంటి సదస్సులతోనే సాధ్యమన్నారు. డాక్టర్ వి.కృష్ణమూర్తి మాట్లాడుతూ భవిష్యత్‌లో యువ రచయితులకు పురస్కారం పేరుతో రూ.లక్ష బహుమతిని ఇవ్వనున్నట్టు ప్రకటించారు. తొలి రోజు సదస్సులో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, ఉపాధ్యాయులు, రచయితలు, విమర్శకులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరీక్షల విజయవంతానికి సహకరించాలి

- ఆర్ఐవో ఉమారాణి



ఆర్ఐవో ఉమారాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు విజయవంతం అయ్యేలా కాంట్రాక్టు లెక్చరర్స్ తగిన సహకారం అందించాలని ఆర్ఐవో పి.ఉమారాణి అన్నారు. ఆర్ఐవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉమారాణికి కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. అసోసియేషన్ నాయకులు శనివారం విశాఖలో ఆర్ఐవో కార్యాలయంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఐవో మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి కాంట్రాక్టు లెక్చరర్స్ కృషిచేయాలన్నారు. ప్రాక్టికల్స్, వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.వి.రమణకుమార్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ క్రిష్టోఫర్, జాయింట్ సెక్రటరీ సీహెచ్.త్రినాథ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు విశేషసేవలు అందించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి



న్యాయసేవా కార్యకర్తలకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

విశాఖ లీగల్: ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి హితవు పలికారు. శనివారం సాయంత్రం జిల్లా కోర్టు ప్రాంగణంలోని లోక్ అదాలత్ భవనంలో సమాంతర న్యాయసేవా సహాయకుల శిక్షణ శిబిరం ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ వెన్నుముక అన్నారు. శిక్షణ పొందిన కార్యకర్తలు గ్రామీణ ప్రజలకు తమ సేవలు అందించాలన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ధృవీకరణ పత్రాలు అందించారు. లోక్ అదాలత్ కార్యదర్శి బులికృష్ణ కార్యక్రమ వివరాలను అందించారు. లోక్ లదాలత్ జాతీయ శిక్షకుడు, సీనియర్ న్యాయవాది రఘుపాత్రుని శ్రీనివాసరావు, కుప్పిలి మురళీధర్, పాపారావు ప్రసంగించారు.

కళాతపస్వికి ఘన నివాళి



మాట్లాడుతున్న డాక్టర్ జి. రఘురామారావు

సీతంపేట (విశాఖ ఉత్తర): పద్మశ్రీ, కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు విశాఖ రసజ్ఞులు ఘన నివాళులు అర్పించారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ జి. రఘురామారావు ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో 'కళా తపస్వికి కైమోడ్పు' పేరిట పలువురు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటుడు, దర్శకుడు, రచయితగా కె.విశ్వనాథ్ తన అపూర్వ ప్రతిభతో తెలుగు సినీ జగత్తుకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. తెలుగు సాహిత్యం, సంగీతం, సంస్కృతి సంప్రదాయానికి పెద్ద పీట వేసిన దర్శక దిగ్గజాన్ని తెలుగు చిత్ర పరిశ్రమ కోల్పోయిందన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. శంకరాభరణం, సాగర సంగమం, స్వాతిముత్యం, సిరివెన్నెల, శృతిలయలు, స్వయం కృషి , స్వర్ణ కమలం, సూత్రధారులు, ఆపద్బాంధవుడు, స్వాతికిరణం, శుభ సంకల్పం , శుభప్రదం ఇలా ఎన్నో ఆణిముత్యాల్లాంటి చిత్రాలను తెలుగు చిత్ర పరిశ్రమకు అందించి తెలుగు సినిమా గర్వించదగిన వ్యక్తుల్లో విశ్వనాథ్ ఒకరిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ప్రసన్నకుమార్, ఆచార్య బాలమోహన్‌దాస్, నరవ ప్రకాశరావు, రచయిత డి.వి.సూర్యారావు, నటులు ఎస్‌కే మిశ్రో తదితరులు పాల్గొని కె.విశ్వనాథ్‌లోని కళాతపస్వికి నివాళులు అర్పించారు.

8న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 8న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి (క్లరికల్) సిహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. హానర్ ల్యాబ్, పెంటాలూన్స్, దివ్యముత్యం రిఫ్రిజిరేషన్, సీఎంఆర్ టెక్స్ టైల్స్, కోస్టల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 138 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. జూనియర్ కెమిస్ట్, ఫ్యాషన్ అసిస్టెంట్, క్యాషియర్, టెక్నీషియన్ హెల్పర్, పెయింటర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, హౌస్ కీపింగ్ బాయ్స్ ఉద్యోగాలకు ఐదు, పదో తరగతి, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐల్లో ఉత్తీర్ణత సాధించి 18–45 సంవత్సరాల వయసు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలకు జీతం నెలకు రూ. 8,000 నుంచి రూ.12,000లు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు మహర్దశ

- నాడు–నేడులో మౌలిక వసతులు పెంపు
- వసతి గృహాల రూపురేఖలు మార్చేలా పనులు
- ప్రభుత్వ ఆదేశాలతో సమగ్ర సర్వే
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన సంక్షేమాధికారులు



నాడు–నేడులో మౌలిక వసతులు పెంపు కోసం ఎంపిక చేసిన చినగదిలి మండలంలోని ఎస్సీ బాలుర హాస్టల్

విశాఖ విద్య: విద్యారంగం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి సైతం పెద్ద పీట వేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల మాదిరే సంక్షేమ హాస్టళ్లలో సైతం 'నాడు–నేడు' కార్యక్రమంలో మౌలిక వసతులు పెంపొందించేలా శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలో నిర్వహిస్తున్న వాటిలో ఒక్కో వసతి గృహాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు సైతం కార్యాచరణ సిద్ధమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ హాస్టళ్లకు మంచి రోజులొచ్చాయని విద్యార్థులతో పాటు సంక్షేమశాఖల అధికారులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాడు నిర్లక్ష్యంతో హాస్టళ్లు ఖాళీ

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థుల చదువులకు బాసటగా నిలిచేలా ప్రభుత్వ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ 3వ తరగతి నుంచి డిగ్రీ ఆ పై కోర్సులు చదువుకునే వారికి వసతి కల్పించి, నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వసతి గృహాల్లో సీటు పొందేందుకు తీవ్రమైన పోటీ ఉండేది. కానీ టీడీపీ ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసింది. ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్ సవ్యంగా అందకపోవటంతో వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు సంక్షేమ వసతి గృహాల్లో ఉండలేక, చదువులకు దూరమయ్యే పరిస్థితులు నాడు ఉండేవి.

నేడు పూర్వవైభవం తీసుకొచ్చేలా..

వెనుకబడిన వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో గూడుకట్టిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలోనే నాడు–నేడు కార్యక్రమంలో వసతి గృహాల అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు సిద్ధమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో ఏ మేరకు పనులు చేపట్టాలనే దానిపై సంక్షేమశాఖల ఇంజనీరింగ్ అధికారులు నివేదిక సిద్ధం చేశారు.

సకల సౌకర్యాలు

వసతి గృహ విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించేలా పనులు గుర్తించారు. భవనాలకు మరమ్మత్తులు చేసి ఆధునీకరించటంతో పాటు శుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నీచర్, ఫ్యాన్లు ఇలా పది అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ సంక్షేమశాఖల పరిధిలో జిల్లాలో 36 వసతి గృహాలు ఉండగా, వీటిలో తొలిదశలో 26 వసతి గృహాల్లో అభివృద్ధి పనులు చేపట్టేలా జాబితా సిద్ధం చేశారు. దశల వారీగా జిల్లాలోని వసతి గృహాలన్నింటిలో పనులు చేపట్టేందుకు అధికారులు అంతా సిద్ధం చేశారు.

జిల్లాలో వసతి గృహాల పరిస్థితి ఇలా..

	మొత్తం హాస్టళ్లు	సొంత భవనాలు	అద్దె భవనాలు	వసతి పొందుతున్న విద్యార్థులు
సాంఘిక సంక్షేమం	22	18	04	1,916
బీసీ వెల్ఫేర్	09	09	-	884
గిరిజన సంక్షేమం	05	05	-	1,467
మొత్తం	36	32	04	4,267

మంచి నిర్ణయం

విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. వసతి, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నీచర్ వంటి ప్రధాన సమస్యలు తీరబోతున్నాయి. చాలా కాలం తరువాత వసతి గృహాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంది. సమగ్ర నివేదికన ఉన్నతాధికారులకు అందజేశాం.

– డి.వి.రమణమూర్తి, జేడీ, సాంఘిక సంక్షేమశాఖ

ఇక లెక్క పక్కా

- హార్బర్‌లో ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలు!
- చేపల తూకాల్లో కచ్చితత్వం కోసం ప్రయత్నాలు
- జూన్ తర్వాత అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు



సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో చేపల కొనుగోళ్లు, అమ్మకాలు సజావుగా సాగేలా ఒక్కో అడుగు ముందుకు పడుతోంది. ఇప్పటికే చేపల కొనుగోళ్లలో 'కొట్టుబడి' విధానానికి ఫుల్‌స్టాప్ పడింది. కొన్నేళ్లుగా సముద్రంలో వేటాడి తెచ్చిన చేపలను ఈ హార్బర్‌లో దళారులు, ట్రేడర్లకు ప్రతి 20 బుట్టలకు ఒక బుట్ట చేపలు అదనంగా ఇవ్వాలన్న అనధికార నిబంధన ఉంది. ఈ విధానంతో తాము నష్టపోతున్నామంటూ బోటు యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇటీవల ట్రేడర్లు, బోటు యజమానుల మధ్య వివాదం రాజుకుంది. ఆపై కొనుగోళ్లలో కొట్టుబడి విధానానికి స్వస్తి పలకంతో బోటు యజమానులు ఊరట చెందుతున్నారు. కాగా బోటు యజమానుల నుంచి చేపలను ట్రేడర్లు మాన్యువల్ కాటాలు, బాస్కెట్ల రూపంలో కొనుగోలు చేస్తున్నారు. ఈ విధానం వల్ల తూకాల్లో వ్యత్యాసాలుంటున్నాయని ఎప్పట్నుంచో బోటు యజమానులు ఆవేదన చెందుతున్నారు. ఉదాహరణకు 15 కిలోల చేపలు/రొయ్యల తూకంలో 2–3 కిలోల మొగ్గు ఉంటుందని, బాస్కెట్ల లెక్కన కొనుగోలు చేసినా తేడాలుంటున్నాయని, ఫలితంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. గతంలో మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎంపెడా) పంపిణీ చేసే బాస్కెట్లు (సుమారు 8 కిలోలు)తో చేపలను కొనుగోలు చేసేవారు. ఇది కూడా కొన్నాళ్ల తర్వాత మరుగున పడింది. ఈ నేపథ్యంలో ఇలాంటి వివాదాలకు తావులేకుండా ఈ హార్బర్‌లో ఎలక్ట్రానిక్ తూనికల యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర మరపడవల సంఘం యోచిస్తోంది. వీటి వల్ల తూకాల్లో కచ్చితత్వం ఉంటుందని, ఇది మత్స్యకారులు/బోటు యజమానులకు మేలు జరుగుతుందని భావిస్తోంది. ఇప్పటికే ఎలక్ట్రానిక్ తూనికల విధానం కాకినాడ, చెన్నై, కేరళ తదితర ప్రాంతాల్లో అమలులో ఉంది. ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాల ఏర్పాటుపై బోటు యజమానులు, ట్రేడర్లు/వ్యాపారులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించనున్నట్టు రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకిరాం 'సాక్షి'తో చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మొదలై జూన్‌తో ముగిసే చేపలవేట నిషేధం తర్వాత ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాల ఏర్పాటు జరిగేలా చూస్తామని తెలిపారు. ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలు అందుబాటులోకి వస్తే తూకాల్లో తేడాల సమస్యకు పరిష్కారం లభించి లాభాదాయకమవుతుందని బోటు యజమానులు ఆశాభావంతో ఉన్నారు.

రోజుకు 150 టన్నుల చేపలు

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 750 వరకు మరబోట్లు రిజిస్టర్ అయ్యాయి. వీటిలో సుమారు 600 బోట్లు వేట సాగిస్తున్నాయి. వీటి నుంచి రోజుకు సగటున 150 టన్నుల చేపలు హార్బర్‌కు వస్తుంటాయి. వీటిని ట్రేడర్లు, వ్యాపారులు కొనుగోలు చేసి స్థానిక మార్కెట్‌తో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.

జీ-20 సమ్మిట్ సెక్రటేరియట్‌గా జీవీఎంసీ గెస్ట్ హౌస్



అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి

అల్లిపురం (విశాఖ దక్షిణ): జీ–20 సమ్మిట్ సెక్రటేరియట్‌గా కిర్లంపూడి లే అవుట్‌లో గల జీవీఎంసీ గెస్ట్ హౌస్ కానుందని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు. ఇటీవల పునర్నిర్మాణం చేసుకున్న జీవీఎంసీ గెస్ట్ హౌస్‌ను రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె గెస్ట్ హౌస్‌లో జీ–20 సదస్సుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇక్కపై జీ–20 సదస్సుకు సంబంధించి సమావేశాలు, చర్చలు సెక్రటేరియట్‌లో జరుగుతాయన్నారు. సమావేశంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సంపత్, ఏపీ గ్రీన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ కల్చర్ మల్లికార్జున్, వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, చీఫ్ ఇంజనీర్ పి.రవికృష్ణరాజు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, సీఎంఒహెచ్ డాక్టర్ కె.ఎస్.ఎల్‌జీ శాస్త్రి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదర రావు, పర్యవేక్షక ఇంజనీర్లు, కార్యనిర్వాహక ఇంజనీర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో విజయవంతంగా శస్త్రచికిత్స

సింహాచలం : నాయుడుతోటలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో 16 ఏళ్ల పెంద్రా శాంసన్ అనే విద్యార్థికి అతి క్లిష్టమైన పిడియాట్రిక్ కంటి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు, పిడియాట్రిక్ కంటి శస్త్ర చికిత్స నిపుణురాలు డాక్టర్ సువర్ణ శనివారం తెలిపారు. విశాఖకు చెందిన పెంద్రా శాంసన్‌కు పుట్టకతోనే కంట్లో జన్యుపరంగా ఏర్పడిన క్యాటరాక్ట్ కారణంగా నల్లగుడ్డు చాలా చిన్నదిగా ఉండటంతో 16 ఏళ్లు వచ్చేసరికి పూర్తిగా చూపు మందగించింది. అడుగు దూరం నుంచి కూడా చేతివేళ్లు గుర్తించలేని పరిస్థితి నెలకుంది. ఇటీవల శంకర్ ఫౌండేషన్ నిర్వహించిన కంటి వైద్యశిబిరానికి వచ్చిన శాంసన్‌కు పరీక్షలు నిర్వహించగా చూపు మందగించిన జబ్బుతో పాటు మెల్ల కూడా ఉన్నట్టు గుర్తించారు. దాంతో ఈనెల 3న డాక్టర్ సువర్ణ బృందం అతనికి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. కంట్లో శుక్లం తొలగించి కంటిలోపల అద్దం అమర్చారు. ఆపరేషన్ తర్వాత శాంసన్ కంటిచూపు బాగుండటంతో అతని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. వైద్యురాలు డాక్టర్ సువర్ణ బృందాన్ని శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ మణిమాల అభినందించారు.

కేంద్ర బడ్జెట్ నిరుత్సాహకరం

అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ వేంకటాచలం



సమావేశంలో మాట్లాడుతున్న వేంకటాచలం

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు అత్యంత నిరుత్సాహకరంగా ఉన్నాయని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ వేంకటాచలం ఆరోపించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్పాదాయ వర్గాలకు ఎదురవుతున్న ప్రధాన సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలను బడ్జెట్‌లో ఏ మాత్రం ప్రస్తావించలేదన్నారు. సంపన్న వర్గాలపై పన్ను విధించకపోవడం, వారిపై గల పన్ను తగ్గించాలని చూడడంతో వారు మరింత సంపన్నులు కావడానికి బడ్జెట్ దోహదపడతుందని చెప్పారు. సంపన్న వర్గాల మీద 1 శాతం పన్ను విధిస్తే దేశ ప్రజల ఆరోగ్యాన్ని ఏడాదిపాటు కాపాడుకోవచ్చన్నారు. మొదటి 10 స్థానాల్లో ఉన్న బిలియనీర్లపై 5 శాతం పన్ను విధిస్తే దేశంలో గల గిరిజన వర్గాలకు ఐదేళ్ల పాటు ఆరోగ్య రక్షణ కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు. బిలీయనర్లపై 2 శాతం పన్ను విధిస్తే ప్రజలందరికీ పోషకాహారం అందించవచ్చని చెప్పారు. దేశ నిరుద్యోగ రేటు 8.3 శాతానికి పెరగడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. అయినప్పటికీ ఈ బడ్జెట్‌లో ఉద్యోగాల కల్పన ప్రస్తావనే లేకపోవడం చాలా బాధాకరమన్నారు. వ్యవసాయ రంగానికి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, విద్య, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వ బ్యాంకులు సహకారం అందించాయన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకులను మరింత పటిష్టపరచాల్సిన అవసరం ఉన్నా విక్రయించే ప్రయత్నం దారుణమన్నారు. బ్యాంకులను ప్రైవేటీకరిస్తే ఏఐబీఈఏ దేశవ్యాప్త నిరవధిక సమ్మెకు, పోరాటాలకు సిద్ధంగా ఉందని హెచ్చరించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు టి.రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు, సంయుక్త కార్యదర్శి పీవీ కృష్ణ పాల్గొన్నారు.

ఎంవీపీ రైతు బజార్ ఆధునికీకరణ



ఎంవీపీ రైతు బజార్‌లో ధరలు తెలుసుకుంటున్న వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ చైర్మన్ రాహుల్ పాండే

ఆరిలోవ: ఎంవీపీ రైతు బజార్‌ను ఆధునికరించనున్నట్లు రాష్ట్ర వ్యసాయ, మార్కెటింగ్ శాఖ చైర్మన్ రాహుల్ పాండే తెలిపారు. ఎంవీపీ రైతు బజార్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఆర్గానిక్ ఉత్పత్తుల స్టాల్ పరిశీలించారు. అందులో మరిన్ని ఎక్కువ ఉత్పత్తులు విక్రయానికి ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముందుగా విశాఖతో పాటు తిరుపతి, విజయవాడ, రాజమండ్రి తదితర పెద్ద పట్టణాలలో రైతుబజార్లను ఆధునికీకరిస్తామన్నారు. ఇందులో భాగంగా ఎంవీపీ రైతు బజార్‌కు పెయింటింగ్ వేయించి, రెండు ప్రధాన ద్వారాలు, లోపల ఎంట్రన్స్ గేట్లకు కొత్తరూపు తీసుకురానున్నామన్నారు. ప్రధాన ద్వారాలలో నేమ్ బోర్డులు కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో పాటు ప్రత్యేకంగా నాలుగు ఆర్గానిక్ షాపులు ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెటింగ్ శాఖ జేడీ సుధాకర్, ఏడీఎం ఎర్రన్న, మార్కెటింగ్ అధికారి యాసిన్, ఈఈ కోటయ్య, డీఈ కెనడీ, ఎస్టేట్ ఆఫీసర్ జి.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లకు పండగే..

- ఏడాదిలో 12 నెలలకూ వేతనాలు మంజూరు
- ఈ ఏడాది ఒక్క రోజు బ్రేక్‌తో కొనసాగింపు
- జిల్లాలో 80 మందికి ఆర్థిక ప్రయోజనం



వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను పర్యవేక్షిస్తున్న అధ్యాపకురాలు గౌరి

విశాఖ విద్య: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న లెక్చరర్లకు 2022–23 విద్యా సంవత్సరంలో 12 నెలలకూ వేతనాలు మంజూరు చేసేలా ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వులపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని 10 జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న 80 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులకు దీని వల్ల ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో వీరికి ఏడాదిలో 10 నెలలకు మాత్రమే వేతనాలు ఇచ్చేవారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ అధ్యాపకులకు మేలు చేసే నిర్ణయం తీసుకున్నారు.

ఒక్క రోజు బ్రేక్‌తోనే కొనసాగింపు

కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఈ ఏడాది మరింత మేలు చేకూర్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత రెండేళ్లుగా ఏడాదిలో 12 నెలలకూ వేతనాలు ఇచ్చినప్పటికీ.. 10 రోజులు బ్రేక్‌తో వీరిని విధుల్లో కొనసాగించే వారు. 2022–23 విద్యాసంవత్సరానికి కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వడంలో ఆలస్యం కావటంతో అధ్యాపకుల్లో దీనిపై చర్చసాగింది. అయితే గతంలో కంటే మెరుగ్గా, ఈ ఏడాది కేవలం ఒక్క రోజు బ్రేక్‌తో కాంట్రాక్ట్ అధ్యాపకులతో విధుల్లోకి తీసుకునేలా జనవరి 30న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పీఆర్‌సీ వర్తింపుతో మెరుగైన వేతనం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏళ్ల తరబబడి కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలపై గత పాలకులెవ్వరూ పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వ హయంలో నెలకు రూ. 27వేలు వేతనం ఇచ్చేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెలకు రూ.37,100కు వేతనం పెంచారు. అంతే కాకుండా కాంట్రాక్టు అధ్యాపకులకు సైతం 2022 పీఆర్‌సీ వర్తింపజేయడంతో మరింత ఆర్థిక ప్రయోజనం చేకూరింది. ప్రస్తుతం నెలకు రూ.57,100 వేతనం అందుకుంటున్నారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ఇంటర్మీడియట్ కమిషనరేట్ అధికారులు కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టారు.

విద్యార్థికి మేయర్ అభినందనలు



హేమంత్‌ను అభినందిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వద్దాది హేమంత్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచాడు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను ఇటీవల రాజమండ్రిలో నిర్వహించారు. ఈ పోటీలలో తోటగరువు హైస్కూల్ నుంచి పాల్గొన్న హేమంత్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. దీంతో శనివారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తన క్యాంప్ కార్యాలయంలో విద్యార్థి హేమంత్‌ను అభినందించారు.